క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన బార్ నూతన కార్యవర్గ ప్రతినిధులు



ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతనంగా ఎన్నికైన జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, కార్యవర్గ సభ్యులు శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఇతర న్యాయమూర్తులను మర్యాద పూర్వకంగా శుక్రవారం వారి చాంబర్‌లలో కలిశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, వైస్ ప్రెసిడెంట్ ఇప్పిలి సీతరాజు, వాన కృష్ణచంద్, పి.వి.రమణ, గణపతి పట్నాయక్, తిరుపతిరావు, కార్యవర్గ సభ్యులు భవానీప్రసాద్, రమణమూర్తి, వనజాక్షి, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



స్టాల్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ ఎస్.వి.రమణ

శ్రీకాకుళం: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, స్వయం సమృద్ధి సాధించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని మెప్మా పీడీ ఎస్.వి.రమణ అన్నారు. శుక్రవారం రైతుబజార్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను సందర్శించారు. ప్రభుత్వ తోడ్పాటుతో చేకూరుతున్న ఆర్థిక లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ ఎస్.వెంకటరావు, జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ పి.విజయకుమారి, స్త్రీనిధి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షులు వి.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై పట్టు తప్పనిసరి



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ అర్పణ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక అంశాలపై పట్టు సాధిస్తేనే మెరుగైన వేతన ప్యాకేజీ లభిస్తుందని వీఎల్‌ఎస్‌ఐ(వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్) ఇంజినీర్, రిసోర్స్ పర్సన్ ఎం.అర్పణ్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వీఎల్‌ఎస్‌ఐ, ప్రస్తుత సాంకేతిక ప్రగతి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ట్రెండ్ నడుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్, ప్రిన్సిపాల్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు, హెచ్‌ఓడీ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం ప్రారంభం



కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్

జి.సిగడాం: మండలంలోని దవళపేటలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా సుమారు రూ.47 లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి రక్షిత పథకాన్ని సర్పంచ్ వడిశ మహేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ఇంటింటా కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, కూటమి నాయకులు బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, పేడాడ స్వాతినాయుడు, ఎన్ని జనార్దనరావు, బొడ్డేపల్లి మురళీ, పేడాడ జనార్దనరావు, కంచరాన రమణరావు, పేడాడ నారాయణరావు, పేడాడ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు దూసి ధర్మారావు జయంతి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ కవి, రచయిత, వక్త దూసి ధర్మారావు 75వ జయంతి వేడుకలు స్థానిక బాపూజీ కళామందిర్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు దూసి ధర్మారావు ఫౌండేషన్ ప్రతినిధులు పి.జగన్మోహనరావు, దూసి వెంకటరమణమూర్తి, మండా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బందారు చిట్టిబాబుకు నివాళిగా బందారు రమణమూర్తి సంగీత సారథ్యంలో లలిత సుధాసాగరం పేరిట గీతాలాపన నిర్వహిస్తామని పేర్కొన్నారు. కథా రచయిత గంటేడ గౌరునాయుడుకు ఫౌండేషన్ సాహితీ పురస్కారం, నృత్య దర్శకురాలు టి.నీరజా సుబ్రహ్మణ్యంకు కళా పురస్కారం, అంబటి రంగారావుకు సేవా పురస్కారంతో సత్కరించనున్నట్లు తెలిపారు. అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

ఆధార్ కేంద్రాల్లో.. అదనపు వసూళ్లు!

- ఈకేవైసీ కోసం ఆధార్ సెంటర్లకు క్యూ కడుతున్న ప్రజలు
- ఇదే అదనుగా దోపిడీకి పాల్పడుతున్న కొందరు నిర్వాహకులు
- పర్యవేక్షించని అధికారులు



రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేయని ఆధార్ సెంటర్

రణస్థలం: ఆధార్ కేంద్రాల్లో అదనపు వసూళ్ల పర్వం మొదలైంది. ప్రభుత్వ పథకాలు, చిరునామా మార్పు, చిన్న పిల్లల వేలిముద్రల అప్‌డేట్, ఇతర అవసరాల కోసం ఆధార్ సెంటర్లకు వస్తే నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నగదు వసూలు చేస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలం, లావేరు, జి.సిగడాం కేంద్రాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండటంతో శ్రీకాకుళం వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఆధార్ సెంటర్ల వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజలకు తప్పని ఈకేవైసీ తిప్పలు..

ప్రభుత్వం ఇటీవల రేషన్ పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేదంటే సరుకులు ఇవ్వడం కుదరదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో ప్రతిమండలంలోనూ 30శాతం మంది పిల్లలు, వృద్ధులు ఆధార్ సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, మొబైల్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, బ్యాంకు ఖాతాకు అనుసంధానం వంటి సేవలకు ప్రభుత్వం నిర్ణీత ధరలను ప్రకటించింది. అయితే కొన్నిసెంటర్లలో మాత్రం నిర్వాహకులు ఎంత చెబితే అంత ఇవ్వాల్సిందే. లేదంటే ఆన్‌లైన్ పని చేయడం లేదని, సర్వర్ సమస్య అంటూ ముప్పు తిప్పలు పెడుతున్నారు.

అరకొరగా సేవలు..

సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నెలలో కొన్ని రోజులు మాత్రమే సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు పెడుతున్నారు. ఆ సమాచారం ప్రజలకు తెలియకపోవడంతో ప్రయివేటు ఆధార్ సెంటర్లపై ఆధారపడాల్సి వస్తోంది. కొన్ని చోట్ల అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి ఆధార్‌లో పేర్లు, చిరునామా, జనన నమోదు తేదీలు మార్చుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అదనపు వసూళ్లు చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, సచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్‌పై ఫిర్యాదు

రణస్థలం: పిల్లల ఆధార్ నమోదు చేయడంలో రణస్థలం శ్రీసాయి ఆధార్ కేంద్రం నిర్వాహకులు తీవ్ర జాప్యం చేస్తున్నారని కొచ్చెర్లకు చెందిన పలువురు మహిళలు శుక్రవారం రణస్థలం తహసీల్దార్ ఎస్.ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా లేవనే నెపంతో నిత్యం తిప్పిస్తున్నారని వాపోయారు. రోజూ పనులు మానుకొని రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ స్పందిస్తూ నిర్వాహకుడితో మాట్లాడారు. తహసీల్దార్ డిజిటల్ సంతకం చెల్లదని చెప్పడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు చెల్లవా అంటూ మండిపడ్డారు. ధనవంతులకైతే వెంటనే పనులు చేస్తూ.. పేదలను తిప్పించడం సరికాదన్నారు. రెండు రోజుల్లో సమస్యను సరిచేయాలని ఆదేశించారు.



రణస్థలం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కొచ్చెర్ల మహిళలు

సచివాలయాల్లో ఏర్పాటు చేయాలి..



గ్రామ సచివాలయాల్లో పూర్తి స్థాయిలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. అలాంటి సేవలు లేకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈకేవైసీ కోసం ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గడువు పొడిగించాలి.

– గొర్లె శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, రణస్థలం

చర్యలు తీసుకుంటాం..



ప్రభుత్వ నిర్ణయించిన ధరల మేరకే ఆధార్ సేవలు అందించాలి. అదనపు వసూళ్లకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామ సచివాలయాల్లోనూ ఆధార్ సేవలు అందేలా చూస్తాం.

– ఎస్.ప్రసాద్, తహసీల్దార్, రణస్థలం

అసంపూర్తి నిర్మాణం..సేవలు మృగ్యం



అంపోలు–2 సచివాలయ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. కొద్దిపాటి పనులు చేస్తే వినియోగంలోకి వచ్చే వీలున్నా ఉన్నతాధికారులు దృష్టిసారించకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అంపోలు–2 పరిధి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- గార

ప్రోత్సాహం కరువై.. నిర్వహణ బరువై..



గత ప్రభుత్వం మత్స్యకారులను ప్రోత్సహిస్తూ ఫిష్ ఆంధ్రా షాపులు కేటాయించింది. ఎచ్చెర్ల మండలం కుశాలపురం పంచాయతీ యాతపేట సమీపంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ముందు మత్స్యకారులకు పదుల సంఖ్యలో షాపులు కేటాయించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం లేకపోవటం, నాణ్యమైన చేపలు లభ్యత కాకపోవడంతో 60 శాతం పైగా షాపులు తెరుచుకోవడం లేదు.

- ఎచ్చెర్ల క్యాంపస్

వర్సిటీ లిఫ్టు.. ఒక్కరైనా ఎక్కితే ఒట్టు..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సైన్స్, అండ్ ఇంజినీరింగ్ కాలేజీలో లిఫ్టు సక్రమంగా పనిచేయటం లేదు. కొన్నిసార్లు మధ్యలోనే ఆగిపోతోంది. దీంతో లిఫ్టు ఎక్కాలంటే విద్యార్థులు, ఉద్యోగులు భయపడుతున్నారు. అనారోగ్యంతో ఉన్నవారు, దివ్యాంగులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

తాగునీటి సమస్య పరిష్కారం

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పైపులైన్ వేసి కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది.



ఎస్సీ కాలనీలో వేసిన తాగునీటి పైపులైన్

విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి



ఎచ్చెర్ల సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజలకు భారంగా మారని విద్యుత్ ట్రూ అప్(సర్దుబాటు) చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎచ్చెర్ల విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నా చేపట్టారు. ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యుత్ చార్జీలు ఐదేళ్లు పెంచబోమన్న హామీకి కట్టుబడాలని సూచించారు. రైతులు, సామాన్యుల పాలిట ఉరితాళ్లుగా స్మార్ట్ మీటర్లు మారనున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు మానకుంటే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బంగార్రాజు, శ్రీనివాసరావు, గోవిందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత కీలకం



సామాజిక తనిఖీ సదస్సులో పాల్గొన్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో పారదర్శకత కీలకమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకరరావు అన్నారు. లావేరు మండల కేంద్రంలో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రగతి నివేదిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 33 పంచాయతీల్లో 1538 పనులను సోషల్ ఆడిట్ బృందాలు పర్యవేక్షించాయని చెప్పారు. రూ.25,60,88,005 వ్యయంతో పనులు నిర్వహించినట్లు తెలిపారు. రూ.1.96 కోట్లు పనులు సక్రమంగా జరగలేదని, ఈ నిధులు రికవరీ చేయాలని సోషల్ ఆడిట్ బృందం సూచించింది. బుడతవలస, లావేరు, బుడుమూరు, బెజ్జిపురం ప్రాంతాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మస్టర్ రికార్డుల్లో దిద్దుబాట్లు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు శైలజ, స్వరూపారాణి, వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

భూమి అప్పగించాలంటూ ధర్నా



స్థలం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: పెదపాడులో జాతీయ రహదారిని పక్కన సర్వే నంబర్–68లో 27 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, ఆ స్థలాన్ని తిరిగి తమకు ఇప్పించాలని కోరుతూ లోపింటి అప్పన్న, ఎచ్చెర్ల తవిటమ్మ, పుక్క పుణ్యావతి, సవలాపురపు అప్పన్న, సవలాపురపు రామకృష్ణ, సవలాపురపు సుజాతలు శుక్రవారం సంబంధిత ప్రదేశంలో ధర్నా చేపట్టారు. 50 ఏళ్ల కింద అప్పటి తలయారి లోపింటి రామయ్యకు ప్రభుత్వం భూమిని అందజేసిందని, ఆయన మృతి చెందడంతో తామంతా సుదూర ప్రాంతాలకు వెళ్లిపోయామని చెప్పారు. ఈ భూమిపై శ్రీకాకుళం నగరానికి చెందిన కొందరు వ్యక్తుల కన్ను పడిందని, సెటిల్‌మెంట్ కింద తప్పుడు సంతకాలు చేయించి భూమిని ఆక్రమించుకునేందుకు కోర్టులో దావా వేశారని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఎస్పీ గ్రీవెన్స్‌లో సైతం ఫిర్యాదు చేశామని బాధితులు విలేకరులకు తెలిపారు.

వర్గీకరణపై న్యాయ పోరాటానికి సిద్ధం



సుప్రీంకోర్టు న్యాయవాదులతో సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా ఎంపరికల్ డేటాను పరిగణనలోకి తీసుకోకపోవడంపై న్యాయ పోరాటానికి ఎయిమ్ సిద్ధమవుతుందని సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, దళిత సంఘాల జేఏసీ నాయకుడు కంత వేణు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో సుప్రీంకోర్టు న్యాయవాదులతో సంప్రదింపులు చేసినట్లు తెలిపారు. తాజా జనాభా గణాంకాలను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులో స్పష్టం చేయగా, అందుకు విరుద్ధంగా 2011 జనాభాను ప్రాతిపదికగా వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడటాన్ని మాల, రెల్లి సంఘాల నేతలు వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

రైతులకు తప్పని విద్యుత్ పాట్లు



కళింగపట్నం సబ్‌స్టేషన్

గార: మండల పరిధిలోని కళింగపట్నం సబ్‌స్టేషన్ ఏరియా త్రీఫేజ్ విద్యుత్ లైన్ ఎప్పటికప్పుడు అంతరాయం ఏర్పడుతుండటంతో స్థానిక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్టేషన్ పరిధిలో 579 వరకు త్రీఫేజ్ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఏడాది పొడవునా చిన్న, సన్నకారు రైతులు వివిధ రకాల పంటలు పండిస్తుంటారు. ప్రస్తుతం మొక్కజొన్న, వరి, మిరప, అపరాలు పంటలు సాగు చేస్తున్నారు. రొయ్యలు సైతం సాగు చేస్తుంటారు. తీర ప్రాంత సబ్‌స్టేషన్ కావడంతో ఎప్పటికప్పుడు విద్యుత్ లైన్‌లో సమస్యలు వస్తుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌కు మబగాం నుంచి నేరుగా 33 కేవీ విద్యుత్ లైను వేయడం గానీ, భూగర్భ కేబుల్ లైన్ వేయడం గానీ చేపడితే సమస్య తీరుతుందని అన్నదాతలు కోరుతున్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్‌మీట్



ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి రోడ్‌లోని శర్వాణి విద్యాలయంలో శుక్రవారం యాన్యువల్ స్పోర్ట్స్‌మీట్ ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఆటపాటలు, క్రీడలతో సందడి చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జాతీయ స్థాయి క్రికెటర్ ఎస్‌హెచ్ శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ, స్కూల్ పీడీ షేక్ మదీనా, సిబ్బంది పాల్గొన్నారు.

రీసెర్చ్ స్కాలర్లకు వైవా వాయిస్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో శుక్రవారం ఇద్దరు పార్టుటైం రీసెర్చ్ స్కాలర్లు బి.సాయికిశోర్ (విశాఖపట్నం, టెక్ మహీంద్ర స్మార్ట్ అకాడమీ అధ్యాపకులు), ఎస్.లక్ష్మీ శ్రీకాంత్ (టెక్కలి, ఐతం కళాశాల అధ్యాపకులు)లకు వైవా వాయిస్ నిర్వహించారు. పూర్వ రిజిస్ట్రార్, విశ్రాంత ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, రెక్టార్ అడ్డయ్య, ఆర్ట్సు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

మండల సమావేశం నేడు

రణస్థలం : మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిన్నింటి రజిని అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

నవోదయకు ఎంపిక

జి.సిగడాం: మండలంలోని కొత్తపెంట ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పొగిరి నూతనకుమార్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం మజ్జి మదన్‌మోహన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జామియా మసీదును అభివృద్ధి చేశాం



మాట్లాడుతున్న జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్

శ్రీకాకుళం కల్చరల్: జామియా మసీదును ఎంతగానో అభివృద్ధి చేశామని, రెండేళ్ల తమ కమిటీ పాలనలో ఆదాయం కూడా పెంచామని కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్ ఆధ్వర్యంలో రెండేళ్ల ప్రగతికి సంబంధించిన వివరాలను శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. గతంలో మసీదు నిర్వహణ ఎలా ఉండేదో అందరికీ తెలుసని, ఈ రెండేళ్లలో తాము భక్తులకు ఎన్నో సదుపాయాలు కల్పించామని చెప్పారు. గతంలో మసీదు ఆదాయం ఏడాదికి రూ.12లక్షలు ఉండేదని, ఈ రెండేళ్లలో రూ.15లక్షలకు పెంచామన్నారు. రూ.5లక్షలతో వజూఖానా నిర్మించామని, దాతల సహకారంతో రూ.1.50 లక్షలతో జానీమాజ్‌లు ఏర్పాటు చేశామని, రూ.4లక్షలతో ఏసీలు అమర్చామని, కలెక్టర్ సహకారంతో మసీదులోకి ఎటువంటి జంతువులు రాకుండా ప్రహరీ నిర్మించామని వివరించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు హాజీ సర్ఫరాజ్ భయ్యా, కార్యదర్శి అక్బర్ బాషా, సహాయ కార్యదర్శి షకూర్‌ఖాన్, కోశాధికారి ఉస్మాన్, సభ్యులు అబ్దుల్, సయ్యద్ షఫీ, ఇర్ఫాన్ భాషా, ఉద్దీన్‌షా కరీం, మహమ్మద్ రఫీ, మతాబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దారి కోసం ధర్నా



ఆందోళన చేస్తున్న స్థానికులు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై దుర్గాలయం సమీపంలో యూటర్న్ ఏర్పాటు చేయాలని, లేదంటే అండర్ పాసేజ్ అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. గ్రామానికి దూరంగా ఉన్న బైపాస్, సింహద్వారం వద్ద మాత్రమే యూటర్న్‌కు అవకాశం ఉందని, దీంతో రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యాతపేట, వెంకటాపురం, అంబేడ్కర్ నగర్ వెళ్లేందుకు ప్రజలు పాట్లు పడుతున్నారని, ఈ ప్రాంతంలో ఎవరైనా మృతి చెందితే చుట్టూ నాలుగు కిలోమీటర్లు తిరిగి శ్మశానవాటికకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. విద్యార్థులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ద్విచక్ర వాహనచోదకులు.. ఇలా అన్ని వర్గాలు వారు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాడాన జనార్దనరావు, నాయకులు పైడి సాంబమూర్తి, అమ్మినాయుడు, అన్నంనాయుడు, పైడి వెంకన్నగారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రణస్థలం : మండలంలోని వెల్పురాయి, కమ్మసిగడాం, బంటుపల్లి, వల్లభరావుపేట, పాతర్లపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శంకుస్థాపన చేశారు. పలుచోట్ల ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ఎల్.అప్పన్న, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు డిప్యుటేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కిల్లారి నారాయణరావును ఉన్నతాధికారులు వయోజన విద్య విభాగానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. కొంతకాలంగా ఆయన్ను బదిలీ చేయాలని కూటమి నాయకులు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9, 10, 12వ తరగతుల్లో మిగులు సీట్లు కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల బాలికల తల్లిదండ్రులు ఆధార్, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫోన్ నంబర్ తదితర వివరాలతో ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భజన పోటీలు రేపు

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో ఈ నెల 30న మండల స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కళాకారుల సంఘం అధ్యక్షుడు డి.ఎం.రామం, కార్యదర్శి పిన్నింటి నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు పోటీలకు హాజరైన బృందాలకు భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని, వివరాలకు 6304350985, 8008254638 నంబర్లను సంప్రదించాలని కోరారు.

2న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గార: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఏప్రిల్ 2న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 25 వరకు ఆన్‌లైన్ చేసేందుకు గడువు ఇవ్వగా, 702 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తు ఫారంతో పాటు విద్యార్హత తెలిపే సర్టిఫికెట్, రైస్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకోవాలని కోరారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



శ్రీకాకుళం కల్చరల్ : గుజరాతిపేట రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరీ దేవీ పీఠంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాజరాజేశ్వరి స్వామికి అభిషేకాలు, అర్చనలు జరిగాయి. పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కనకదుర్గకు విశేష పూజలు

ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రంలోని కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నేతేటి రుషికుమార్ శర్మ ఆధ్వర్యంలో వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.